డ్రైనేజీ, వర్షపు నీటి సమస్యను పరిష్కరించండి

అంబర్‌పేట: బతుకమ్మ కుంట సాయిమధురనగర్‌లో వర్షపు, డ్రైనేజీ నీటితో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారని తక్షణమే సమస్య పరిష్కారించాలని బాగ్‌అంబర్‌పేట కార్పొరేటర్ బి.పద్మా వెంకట్‌రెడ్డి అధికారులకు సూచించారు. మంగళవారం స్థానికుల ఫిర్యాదు మేరకు సంబంధిత సమస్య తలెత్తిన ప్రాంతాన్ని పర్యటించారు. వారం రోజులుగా స్థానికులు ఇబ్బందులు పడుతున్నారని వెంటనే పరిష్కారానికి చర్యలు చేపట్టాలని ఆమె ఆదేశించారు.

అలసత్వం వహిస్తే సహించేది లేదు

నల్లకుంట: స్థానిక బస్తీలు, కాలనీల్లో నెలకొన్న సమస్యల పరిష్కారంలో అధికారులు అలసత్వం వహిస్తే సహించేది లేదని ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అన్నారు. మంగళవారం నల్లకుంట డివిజన్ పరిధిలోని టీఆర్టీ కాలనీలో ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా స్థానికులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వీధుల్లో పేరుకు పోయిన చెట్ల కొమ్మలను తొలగింపచేయాలని జీహెచ్‌ఎంసీ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎంవోహెచ్ డాక్టర్ హేమలత, టీఎస్ఎస్‌పీడీసీఎల్ ఏఈ పృథ్వీరాజ్, హార్టికల్చర్ అధికారి భాస్కర్, ఏఈ ఫయాజ్, జీహెచ్‌ఎంసీ అధికారులు పాల్గొన్నారు.

కవితకు బెయిల్.. సంబురాల్లో బీఆర్‌ఎస్

ముషీరాబాద్: లిక్కర్ స్కామ్‌లో ఆరోపణలు ఎదుర్కొంటూ ఐదు నెలలుగా తిహార్ జైలులో ఉన్న ఎమ్మెల్సీ కవితకు సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేయడం పట్ల బీఆర్‌ఎస్ శ్రేణులు సంబరాలు నిర్వహించారు. ముషీరాబాద్ నియోజకవర్గంలోని ఆర్టీసీక్రాస్ రోడ్స్‌లో బాణసంచా కాల్చి మిఠాయిలు పంచిపెడుతూ సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా సీనియర్ బీఆర్‌ఎస్ నాయకులు సుధాకర్‌గుప్తా, ముచ్చకుర్తి ప్రభాకర్, దీన్‌దయాల్ రెడ్డి తదితరులు మాట్లాడుతూ.. స్కామ్ నుంచి కడిగిన ముత్యంలా కవిత బయటకు వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. బుధవారం ఎయిర్‌పోర్టులో ఘన స్వాగతం పలకనున్నట్లు తెలిపారు.

జర్నలిస్టుల ఇళ్ల స్థలాల అంశంపై సీఎంతో చర్చిస్తా

జీహెచ్‌జే సొసైటీ నేతలకు మంత్రి పొన్నం ప్రభాకర్ హామీ

ముషీరాబాద్: జర్నలిస్టుల ఇళ్ల స్థలాల అంశాన్ని ముఖ్యమంత్రి, మంత్రి మండలి దృష్టికి తీసుకువెళ్లి త్వరలో సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తామని రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. గ్రేటర్ హైదరాబాద్‌లో పని చేస్తున్న జర్నలిస్టులు సభ్యులుగా ఉన్న తమ సొసైటీకి ఇళ స్థలాలు కేటాయించాలని కోరుతూ గ్రేటర్ హైదరాబాద్ జర్నలిస్టు మ్యూచువల్లీ ఎయిడెడ్ కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ ప్రతినిధులు మంగళవారం సచివాలయంలో మంత్రి పొన్న ప్రభాకర్‌ను కలిశారు. సొసైటీ అధ్యక్షులు మామిడి సోమయ్య, కార్యదర్శి బొల్లం శ్రీనివాస్‌లు మంత్రికి జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్యను వివరించారు.

◆ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు ఇస్తామని అన్నారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి కేబినెట్ ఆమోదం ద్వారా అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలిస్తామని అన్నారు. మంత్రిని కలిసిన వారిలో సొసైటీ ప్రతినిధులు పులిపలుపుల ఆనందం, సీతా రామరాజు, వీరారెడ్డి, పి.నాగమణి, వేముల పుష్పలత, డి.వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


యజమాని ఇంట్లో చోరీ.. పనిమనిషి రిమాండ్



అంబర్‌పేట: యజమాని ఇంట్లో పని మనిషి బంగారు ఆభరణాలను చోరి చేసింది. ఈ ఘటన నారాయణగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఏసీపీ శంకర్, ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్ వివరాల ప్రకారం.. నారాయణగూడలో నివసించే న్యాయవాది సీ.విపిన్ ఇంట్లో కాచిగూడ లింగంపల్లిలో నివసించే చాకలి ఇందిర(42) పని చేస్తుంది. సరిగ్గా పనికి రాకపోవడంతో యజమాని ఆమెను మందలించాడు. ఈ నెల 24న విపిన్ వేరే పని నిమిత్తం బయటకి వెళ్లారు. అదే సమయంలో అతడి నాణమ్మకు చెందిన ఐదు తులాల మంగళసూత్రం, రెండున్నర తులాల గొలుసు, ఒక తులం చెవి రింగులను పని మనిషి అపహరించింది. విపిన్ ఊరెళ్లి వచ్చేసరికి ఆభరణాలు కనిపించలేదు. వెంటనే నారాయణగూడ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు అనుమానంతో పని మనిషిని విచారించగా చోరీ అంగీకరించింది. ఆమె వద్ద ఆభరణాలను స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించారు.

విషజ్వరాల విజృంభణ..
ఏదీ దోమల నియంత్రణ?

- వైద్యారోగ్య, ఎంటమాలజీ విభాగాల మధ్య కొరవడిన సమన్వయం
- హుస్సేన్‌సాగర్ నాలా పరివాహక ప్రాంతాల్లో దోమల బెడద
- సర్కిల్‌లో తూతూమంత్రంగా యాంటీ లార్వా ఆపరేషన్ నిర్వహణ



కవాడిగూడ: విషజ్వరాలు ప్రజలను భయపడుతున్నాయి. రోజు రోజుకు సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్న అధికారులు ఫొటోలకు పరిమితమై జ్వర బాధితులు పెరిగిపోతున్న ప్రాంతాలలో ప్రత్యేక చర్యల సంగతి విస్మరిస్తున్నారు. ఆశించిన స్థాయిలో యాంటీ లార్వా ఆపరేషన్ జరగకపోవడం గమనార్హం. వాతావరణంలో ఒక్కసారిగా మార్పుల కారణంతోపాటు ఎడతెరిపి లేని వర్షాల వల్ల చాలా మంది ఆసుపత్రులకు సీజనల్ వ్యాధులతో క్యూకట్టడం ఆందోళన కలిగిస్తోంది. ప్రజల ఆరోగ్య పరిరక్షణలో పారిశుద్ధ్యం, ఫాగింగ్ ప్రధాన పాత్ర పోషిస్తాయి. కానీ వాటి నిర్వహణలో నిర్లక్ష్యం నెలకొంటుంది. దీంతో విషజ్వరాలు ప్రభలుతున్నాయి. దీంతో ప్రైవేటు, ప్రభుత్వ ఆస్పత్రులలో నమోదు అవుతున్న మలేరియా, వైరల్ జ్వరాలే ఇందుకు నిదర్శనం.

దోమల నిర్మూలనకు చేయాల్సింది ఇది...

ముందస్తుగా ప్రతి ఇంటికి యాంటీ లార్వా ఆపరేషన్ (ఏఎల్‌వో) సిబ్బంది వెళ్లి దోమల నియంత్రణకు మందు పిచికారీ చేయాలి. మలేరియా వైరల్‌జ్వరాలు వచ్చిన వారి ఇంటి చుట్టూ ఇండ్లలో పరిస్థితిని పరిశీలించి నీటి నిల్వలు తొలగించి లార్వా వృద్ధిని అరికట్టాలి. పట్టణ ఆరోగ్య కేంద్రాల సిబ్బంది ఇంటింటికి వెళ్లి జ్వర బాధితుల వివరాలు సేకరించాలి. ఈ రెండు విభాగాల వారు సమన్వయంతో పనిచేస్తూ క్షేత్ర స్థాయిలో కసరత్తు జరగాలి. కానీ ఇదేమివాస్తవంలా కనిపించడం లేదు. యాంటీ లార్వా ఆపరేషన్ తూతూ మంత్రంగా చేస్తున్నారన్నది వాస్తవం. ఇటీవల స్వచ్ఛదనం – పచ్చదనం కార్యక్రమాలు కేవలం ఫొటోలకు మాత్రమే పరిమితం అయ్యాయనే ఆరోపణలు ఉన్నాయి.

ఫాగింగ్ నిర్వహణలో అవకతవకలు...

ముషీరాబాద్‌సర్కిల్‌లో వెహికిల్ మౌంటెడ్ ఫాగింగ్ మెషిన్లు మూడు ఉన్నాయి. పోర్టబుల్ ఫాగింగ్ మెషిన్లు 12 ఉన్నాయి. పారిశుద్ధ్యం, ఫాగింగ్ నిర్వహణలో చోటు చేసుకుంటున్న అవకతవకలపై అధికారులు దృష్టి సారించడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఫాగింగ్‌లో వినియోగించే డీజిల్, పెట్రోలులో చేతి వాటం ప్రదర్శిస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. సర్కిల్ పరిధిలోని ఆరు డివిజన్లలో ఒక్కొక్క ఫాగింగ్ యంత్రానికి రోజు 9.5 లీటర్ల డీజిల్, ఒటిన్నర లీటర్ల పెట్రోలు వినియోగిస్తుంటారు. ఇందులో కొంత ఇందనాన్ని సంబంధిత సిబ్బంది పక్కదారి పట్టిస్తూ మొక్కుబడిగా ఫాగింగ్ నిర్వహిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

ఫిర్యాదు వస్తే ఫాగింగ్ చేస్తున్నాం

ముషీరాబాద్ సర్కిల్‌లోని ఆరు డివిజన్లలో ముఖ్యంగా బస్తీలలో నాలా పరివాహక ప్రాంతాలలో ఫాగింగ్ చేస్తున్నాం. ఆన్‌లైన్‌లో వచ్చిన ప్రతి ఫిర్యాదుకు స్పందించి వెంటనే ఫాగింగ్ చేస్తున్నాం.

– మహేష్‌కుమార్,ఎంటమాలజీ విభాగం అధికారి

సిబ్బందిని పెంచాలి



జీహెచ్‌ఎంసీ ఎంటమాలజీ విభాగంలో సిబ్బంది కొరతతో యాంటీ లార్వా ఆపరేషన్ నిర్వాహణ కష్టంగా మారుతుంది. ఈ విషయంపై జోనల్ కమిషనర్ జీహెచ్‌ఎంసీ అధికారులు దృష్టి సారించి కవాడిగూడలో ప్రధానంగా స్లమ్ ఏరియాలు ఎక్కువగా ఉంటాయి. కాబట్టి ఎంటమాలజీ విభాగంలో జనాభా సంఖ్యకు అనుగుణంగా సిబ్బందిని పెంచాలి.

– కవాడిగూడ కార్పొరేటర్ జి. రచనశ్రీ

నెలకోసారి ఫాగింగ్ చేయడం లేదు



గూడాలబస్తీ పూర్తిగా హుస్సేన్‌సాగర్ నాలా ఒడ్డున ఉంటుంది. సహజంగానే మా బస్తీలో దోమలబెడద ఎక్కువగా ఉంటుంది. వర్షాకాలంలో పెరుగుతున్న నీటి నిల్వలతో దోమలు విజృంభిస్తున్నాయి. దోమల నియంత్రణ కోసం నెలకొక్కసారి కూడా జీహెచ్‌ఎంసీ అధికారులు ఫాగింగ్ చేయడం లేదు. దీంతో బస్తీ వాసులు మలేరియా, వైరల్ జ్వరాల బారిన పడుతున్నారు. జీహెచ్‌ఎంసీ అధికారులు స్పందించి దోమల నివారణకు చర్యలు తీసుకోవాలి.

– బల్లేకారి రమేష్, గూడాల బస్తీ అధ్యక్షుడు

కనిపించని యాంటీ లార్వా సిబ్బంది



వర్షాకాలంలో దోమల వృద్ధి పెరగడంతో కాలనీలో చిన్నారులు, వృద్ధులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సంబంధిత జీహెచ్‌ఎంసీ యాంటీ లార్వా సిబ్బంది గోడమీద పెన్సిల్‌తో డేట్ వేయడం తప్ప ఎలాంటి దోమల నివారణ చర్యలు తీసుకోవడం లేదు.

– విశాల్, ఎల్‌ఐసీ కాలనీ నివాసి

పైపులైన్ల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాలి



జలమండలి అధికారులతో సమావేశమైన బీజేపీ రాష్ట్ర నేతలు వెంకటేష్, మహేందర్‌బాబు

కవాడిగూడ: కవాడిగూడ డివిజన్‌లో కొన్ని రోజులుగా పురాతన డ్రైనేజీ పైప్‌లైన్ వల్ల నిత్యం డ్రైనేజీ నిండి స్థానిక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో కవాడిగూడ కొత్తబజార్ నుంచి భాగ్యలక్ష్మి నగర్‌కాలనీ, చిత్రాలనగర్‌లో నెలకొన్న సమస్యను పరిష్కరించేందుకు ప్రతిపాదనలను రూపొందించాలని జలమండలి డీజీఎం కార్తిక్‌రెడ్డిని కవాడిగూడ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు ఎంసీ మహేందర్‌బాబు, బీజేపీ రాష్ట్ర నాయకుడు జి.వెంకటేష్ కలిసి కోరారు. మంగళవారం ఎల్‌ఐసీకాలనీ వద్ద ఉన్న జలమండలి డీజీఎం కార్యాలయంలో వాటర్ వర్క్స్ డీజీఎం కార్తిక్‌రెడ్డి, మేనేజర్ శ్రీధర్‌లతో వారు సమావేశం అయ్యారు. కవాడిగూడ డివిజన్ కొత్తబజార్, మజీద్‌గల్లీ, శివాజీచౌక్, మల్లయ్యహోటల్, తాళ్లబస్తీ, చిత్రాలనగర్, ఉన్నికోట, భాగ్యలక్ష్మి కాలనీ తదితర బస్తీలలో పైప్‌లైన్లు శిథిలావస్థకు చేరుకున్నాయని అన్నారు. ఈ విషయాన్ని కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లగా నూతన డ్రైనేజీ పైప్‌లైన్ ఏర్పాటుకు స్థానిక జలమండలి అధికారులు ప్రతిపాదనలు పంపిస్తే తన బడ్జెట్ నుంచి నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చినట్లు వారు పేర్కొన్నారు. కవాడిగూడలో జనాభాకు అనుగుణంగా పైప్‌లైన్ ఏర్పాటు కోసం ప్రతిపాదనలు పంపించాలని అధికారులకు విన్నవించారు. ఈ పైప్‌లైన్ ఏర్పాటుతో కవాడిగూడ డివిజన్ పరిధిలోని అనేక బస్తీలలో డ్రైనేజీ సమస్య తీరిపోతుందని వారు చెప్పారు.

మహిళా సాధికారితపై సదస్సు

ముషీరాబాద్: రాష్ట్ర మహాసభలను పురస్కరించుకొని మంగళవారం రాంనగర్‌లోని ఆర్కే డిగ్రీ, పీజీ కాలేజీలో మహిళా సాధికారిత అంశంపై సదస్సు నిర్వహించారు. ఆర్థిక, సామాజిక, రాజకీయ అవకాశాలను అందుకోగలిగినప్పుడే మహిళా సాధికారిత సాధ్యం అవుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పీవోడబ్ల్యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అనసూయ, రిటైర్డ్ బీసీ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ బాలచందర్, హైదరాబాద్ నగర కార్యదర్శి పుష్ప, కమిటీ సభ్యులు సుజాత, ప్రేమలత, సభ్యులు నాగమణి, చందు తదితరులు పాల్గొన్నారు.

పైపులైన్ నిర్మాణ పనులను ప్రారంభించాలి

చిక్కడపల్లి: కచ్చా నాలా నూతన పైపులైన్ నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలని గాంధీనగర్ డివిజన్ కార్పొరేటర్ ఏ. పావని వినయ్‌కుమార్ జీహెచ్‌ఎంసీ ఉన్నతాధికారులను కోరారు. మంగళవారం ఆర్టీసీ క్రాస్ రోడ్డులోని లక్ష్మీగణపతి ఆలయం సమీపంలోని జవహర్‌నగర్ రోడ్డు నుంచి జీహెచ్‌ఎంసీ ఉన్నతాధికారులతో కలిసి ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ..లక్ష్మీ గణపతి ఆలయం రోడ్డులో డ్రైనేజీ నీరు తరచుగా పొంగిపొర్లడంతో భక్తులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. డ్రైనేజీ కనెక్షన్లను కచ్చా నాలాలోకి ఇవ్వడంతో చెత్తాచెదారం, మట్టి పేరుకుపోయి డ్రైనేజీ సమస్య తలెత్తుతుందన్నారు. నాలాలోని వ్యర్థాలను వెంటనే తొలగించి పైపులైన్ పనులను ప్రారంభించాలన్నారు. కార్యక్రమంలో ఏఈ అబ్దుల్ సలాం, వాటర్‌వర్క్స్ డీజీఎం కార్తీక్‌రెడ్డి, మేనేజర్ కృష్ణమోహన్, నాయకులు వినయ్‌కుమార్, రత్నసాయిచంద్, శ్రీకాంత్, సాయికుమార్, ఆనంద్‌రావు తదితరులు పాల్గొన్నారు.



ఉన్నతాధికారులతో పర్యవేక్షిస్తున్న కార్పొరేటర్ పావని వినయ్‌కుమార్

అలరించిన సినీ సంగీత విభావరి



చిక్కడపల్లి: సీల్‌వెల్ కార్పొరేషన్, ఆదర్శ ఫౌండేషన్, ఆర్‌ఆర్ ఫౌండేషన్‌ల ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి త్యాగరాయ గానసభలో సినీ సుస్వరాలు శీర్షికతో నిర్వహించిన తెలుగు, హిందీ సినీ సంగీత విభావరి అలరించింది. గాయనీగాయకులు పాల్గొని ఎంపిక చేసుకున్న గీతాలను శ్రవణానందనగా ఆలపించారు. ఈ సందర్భంగా ఎంపిక చేసిన గౌరవ సన్మానాలు చేశారు. ఈ కార్యక్రమంలో నవరస గాయని ఆమని తదితరులు పాల్గొన్నారు.

సంతాపం

నల్లకుంట: ప్రముఖ ఆధ్యాత్మిక పత్రిక ఏబీ6 సంపాదకుడు విష్ణుదాసు శ్రీకాంత్ మాతృమూర్తి అరుణాదేవి అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న తెలంగాణ బ్రాహ్మణ సేవా సమితి(టీబీఎస్ఎస్) అధ్యక్షుడు పోచంపల్లి రమణా రావు తదితరులు మంగళవారం మృతురాలి నివాసానికి వెళ్లి నివాళులర్పించి ఆమె కుటుంబ సభ్యులను ఓదార్చి సంతాపం తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టీబీఎస్ఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దేవులపల్లి రంగారావు, ప్రచార కార్యదర్శి మంత్రి సునిల్, ఆర్కే దేశ్‌ముఖ్, కరకంపట్ల రామారావు, కానాల శ్యాం సుందర్ రావు, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు దేవులపల్లి బాలచందర్ శర్మ, ప్రధాన కార్యదర్శి గంప రంగారావు, దవులపల్లి అశోఖ్ కుమార్, సీనియర్ పాత్కియులు అక్కినేని పురుషోత్తం రావు తదితరులు పాల్గొన్నారు.

శాంతియుత వాతావరణంలో పండుగలు జరుపుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఈస్ట్ జోన్ డీసీపీ డాక్టర్ బాలస్వామి

నల్లకుంట: గణేష్ నవరాత్రి, మిలాద్ ఉన్ నబీ వేడుకలను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని ఈస్ట్ జోన్ డీసీపీ డాక్టర్ బాలస్వామి ప్రజలకు సూచించారు. మంగళవారం సాయంత్రం నల్లకుంట పోలీస్ స్టేషన్ పరిధిలోని లలితా నగర్ కమ్యూనిటీహాల్‌లో వివిధ పార్టీల నాయకులు, గణేష్ మండపాల నిర్వాహకులు, మత పెద్దలు, స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులతో పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. దీనికి హాజరైన డీసీపీ మాట్లాడారు. మండపాలు ఏర్పాటుకు ముందస్తుగా అనుమతులు తీసుకోవడం తప్పనిరన్నారు. అలాగే మండపాల వద్ద డీజేలకు అనుమతి లేదని, మైకుల ఏర్పాటుకు ముందస్తుగా మీ–సేవలో చలానా చెల్లించి సమీపంలోని పోలీస్ స్టేషన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎలాంటి అవాంచనీయ ఘటనలకు తావు లేకుండా మత పెద్దలు చొరవ తీసుకోవాలన్నారు. ఈస్ట్ జోన్ అడిషనల్ డీసీపీ నర్సయ్య, ఏసీపీలు, సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి

అంబర్‌పేట: అంబర్‌పేట సర్కిల్ పరిధిలో దశలవారీగా బహిరంగా చెత్త డంపింగ్ కేంద్రాలను తొలగించేందుకు చర్యలు చేపట్టాలని జీహెచ్‌ఎంసీ సర్కిల్–16 డీఎంసీ మారుతీ దివాకర్ అధికారులు, సిబ్బందికి సూచించారు. మంగళవారం అంబర్‌పేటలో ఏఎంహెచ్‌వో డాక్టర్ హేమాలతో ఎస్‌హెచ్‌ఏలతో కలిసి సమావేశం నిర్వహించారు. అలాగే గణేష్ ఉత్సవాలు రానున్న నేపథ్యంలో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంసీ మారుతీదివాకర్

చెరువులు, కుంటలను సంరక్షించాలి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: హైడ్రా సంస్థను రాష్ట్ర వ్యాప్తంగా విస్తరింప చేసి రియల్ ఎస్టేట్, రాజకీయ బడాబాబుల నుంచి చెరువులు, కుంటలను సంరక్షించాలని అఖిల భారత మత్స్యకారులు, మత్స్య కార్మిక సమాఖ్య జాతీయ కార్యదర్శి లెల్లెల బాలకృష్ణ డిమాండ్ చేశారు. టీఎంకేఎంకేఎస్ రాష్ట్ర కమిటీ సమావేశం సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు శీలం శ్రీను అధ్యక్షతన సుందరయ్య విజ్ఞాన కేంద్రంలోని షోయబ్ హాల్‌లో మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఉచిత చేప పిల్లల సరఫరాలో అవకతవకలను నిర్మూలించి మత్స్యకారులకు న్యాయం చేయాలన్నారు. టెండర్ల ప్రక్రియను రద్దు చేసి మత్స్య సొసైటీ అకౌంట్లలో నగదు జమ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ముఠా విజయ్‌కుమార్, రాష్ట్ర కార్యదర్శి కొప్పు పద్మ, రాష్ట్ర కమిటీ సభ్యులు గాండ్ల అమరావతి, ముఠా దశరథ్, రంగారెడ్డి జిల్లా నాయకులు వెంకన్న, పూలగాజుల జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

త్యాగరాయ గానసభ.. జన్మాష్టమి వేడుక



చిన్నారులకు ప్రశంస పత్రాలను అందజేస్తున్న బీఆర్‌ఎస్ నేత నాగేష్‌ముదిరాజ్

చిక్కడపల్లి: తెలంగాణ ఫోక్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి త్యాగరాయ గానసభలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు రాధాకృష్ణుడు, గోపికల వేషధారణతో ఆకట్టుకున్నారు. ప్రతిభను చాటిన చిన్నారులకు బీఆర్‌ఎస్ నేత నాగేష్‌ముదిరాజ్ ప్రశంస పత్రాలను అందజేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత జడ్జి బి.మధుసూదన్, సరస్వతి ఉపాసకులు దైవజ్ఞశర్మ, నిర్వాహణ సంస్థ అధ్యక్షుడు విక్కీ మాస్టర్ తదితరులు పాల్గొన్నారు.

జవహర్‌నగర్ కమ్యూనిటీహాల్‌లో..

జవహర్‌నగర్ కమ్యూనిటీహాల్‌లో తెలంగాణ యాదవ సేన కమిటీ ఆధ్వర్యంలో జన్మాష్టమి వేడుకలలో ఎంపీ అనిల్‌కుమార్‌యాదవ్, యాదవ సేన రాష్ట్ర అధ్యక్షుడు మెరుగు శ్రీనివాస్‌యాదవ్, సభ్యులు బోయిన కిషన్ యాదవ్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

దోమలగూడ హనుమాన్ దేవాలయంలో...

కవాడిగూడ: దోమలగూడ హనుమాన్ దేవాలయంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు అఖిల భారత యాదవ మహాసభ ముషీరాబాద్ నియోజకవర్గం అధ్యక్షుడు సలంద్రి శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్‌యాదవ్, ఎమ్మెల్యే ముఠాగోపాల్, కార్పొరేటర్లు జి.రచనశ్రీ, కె.రవిచారి, కన్నె ఉమాదేవి, యాదవ మహాసభ నగర అధ్యక్షుడు మహేందర్‌యాదవ్, జాతీయ కార్యదర్శి ఆర్ లక్ష్మణ్, నిర్వాహకులు సలంద్రి శ్రీనివాస్ యాదవ్, పాశం అనిల్ యాదవ్, చుక్కా నర్సింగ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

వివేక్‌నగర్ ఆంజనేయస్వామి దేవాలయంలో...

చిక్కడపల్లి: వివేక్‌నగర్ ఆంజనేయస్వామి దేవాలయంలో శ్రావణమాసం సందర్భంగా మంగళవారం శ్రీభువనేశ్వరి అమ్మవారు శాకాంబరిదేవి అలంకారణంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదే విధంగా శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా రాధాకృష్ణులను ప్రత్యేక పూలతో అలకరించారు. అనంతరం నిర్వహించిన పూజలో ప్రత్యేక భక్తులు పెద్ద సంఖ్యలో చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో ఎం.దేవనాథం, అర్చకులు బుగ్గ లక్ష్మీపతిశర్మ, వెంకటాద్రి, రాజన్, సిబ్బంది, భక్తులు తదితరులు పాల్గొన్నారు.





జవహర్‌నగర్, దోమలగూడ వేడుకల్లో రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్ యాదవ్, నిర్వాహకులు



శాకాంబరిదేవి అలంకరణలో భక్తుల పూజలు

ట్రస్టు, సొసైటీ అనే తేడా లేకుండా పనిచేస్తాం

- హెబ్రోను ట్రస్టు, సొసైటీ ప్రతినిధులు
- దైవజనుడు బ్రదర్ భక్తసింగ్ చూపిన మార్గంలో పయనిస్తాం



మాజీ ఎమ్మెల్సీ రాజేశ్వర్‌రావు, చిత్రంలో వై.జాన్‌సుబ్బారెడ్డి, జోసెఫ్‌కురియన్, బెనహర్

చిక్కడపల్లి: ఐక్యంగా ఉంటూ దైవజనుడు బ్రదర్ భక్తసింగ్ చూపిన మార్గంలో పయనిస్తామని.. ప్రపంచ వ్యాప్తంగా ప్రసిద్ధిగాంచిన గాంధీనగర్ గోల్కొండ క్రాస్ రోడ్డులోని హెబ్రోను చర్చి వ్యవస్థాపకుడు బ్రదర్ భక్తసింగ్ ఆశయాలకు అనుగుణంగా అంతా కలసికట్టుగా పనిచేస్తామని హెబ్రోను ట్రస్టు, సొసైటీ ప్రతినిధులు వై.జాన్ సుబ్బారెడ్డి, జోసెఫ్ కురియన్, మాజీ ఎమ్మెల్సీ రాజేశ్వర్‌రావులు తెలిపారు. కొన్నేళ్లుగా హెబ్రోను చర్చి సొసైటీ ట్రస్ట్ సభ్యుల మధ్య కొనసాగుతున్న విబేధాల నేపథ్యంలో మంగళవారం మాజీ ఎమ్మెల్సీ రాజేశ్వర్‌రావు అధ్యక్షతన ట్రస్టు, సొసైటీ ఇరువర్గాల మధ్య సమాధాన, సమన్వయ సమావేశం నిర్వహించారు.

◆ అనంతరం చర్చి ప్రాంగణంలో విలేకరుల సమావేశంలో మాట్లాడూ... ఎలాంటి విబేధాలకు తావులేకుండా ట్రస్టు, సొసైటీ అనే తేడా లేకుండా అంతా కలసి హెబ్రోను సంఘం క్షేమం కోసం పనిచేస్తామన్నారు. దేవజనుడు బ్రదర్ భక్తసింగ్ చూపిన మార్గంలో పయనిస్తామని తీర్మానించామని ఇందుకు రెండు రాష్ట్రాలతో పాటు ప్రపంచవ్యాప్తంగా ఉన్న హెబ్రోను సంఘాల విశ్వాసులంతా సహకరించాలని కోరారు. హెబ్రోను పరిచర్యను ఇక నుంచి కలసికట్టుగా కొనసాగిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బెనహర్, పలువురు హెబ్రోను సంఘాల విశ్వాసులు, దేవసేవకులు పాల్గొన్నారు.

అలజడి సృష్టించడం సరికాదు..

చిక్కడపల్లి: గోల్కొండ క్రాస్ రోడ్డులోని హెబ్రోను చర్చిలో పోలీసులు ప్రోద్భలంతో ట్రస్టు సభ్యులు అలజడి సృష్టించడం సరికాదని క్రైస్తవ ధర్మప్రచార పరిరక్షణ సమితి జాతీయ అధ్యక్షుడు జెరుసలెం మత్తయ్య అన్నారు. మంగళవారం రాత్రి ఆయన ఒక ప్రకటనలో విడుదల చేశారు. చట్టబద్ధంగా కొనసాగుతున్న హెబ్రోను సొసైటీ చర్చిలో ట్రస్టుకు చెందిన కొందరు సభ్యులు ప్రవేశించడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. కొందరి ప్రోద్భలంతో కోర్టు కేసులను లెక్క చేయకుండా చర్చిలోకి ప్రవేశించి అలజడి సృష్టించడం సరికాదన్నారు. ట్రస్టు, సొసైటీ లేదని మాట్లాడటమేమిటని ఆయన ప్రశ్నించారు. ఈ విషయంలో ప్రభుత్వం జోక్యం చేసుకొని హెబ్రోను సొసైటీకి తగిన రక్షణ కల్పించాలని కోరారు.